ప్రజాగళం PGN NEWS

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

RNI NO.APTEL/2006/18110

ప్రచురణ : నిజామాబాద్ పబ్లిషర్ : కొక్కు రవికుమార్ శుక్రవారం 17-04-2026 సంపుటి : 2 సంచిక :166 పేజీలు : 8 వెల : 1.00


## చందానగర్ లో బీజేపీ నారి శక్తి వందన్

చందానగర్ హైదరాబాద్ చందానగర్ లో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నారి శక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్ర రావు పాల్గొన్నారు. చందానగర్ లో అంబేద్కర్ విగ్రహానికి రామచంద్ర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చందానగర్ అంబేద్కర్ విగ్రహం నుంచి బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు.

## అమిత్ షా వర్సెస్ అఖిలేశ్..




న్యూ ఢిల్లీ, మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో నేడు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీ వేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూడుకులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# ఈ రాజ్యాంగ సవరణ బిల్లు దేశ చరిత్రలోనే గొప్పది: ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు.'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు.ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు.

## పెట్టుబడులు పెట్టండి.. అమెరికా పారిశ్రామిక వేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 16: అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో మంత్రి శ్రీధర్ బాబుసమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా



స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. ఎఉ-తిఖయూ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

# యువతకు ప్రభుత్వం గుడ్ న్యూస్



తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువత కోసం కొత్త పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. భారీ సబ్సిడీతో వారికి ప్రోత్సాహం ఇవ్వాలని డిసైడ్ అయింది. ఇందు కోసం ఈ తాజా ప్రతిపాదన విధి విధానాలను ఖరారు చేసింది. ఇప్పటికే యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా.. వచ్చే వారం నుంచి లబ్దిదారులను ఎంపిక చేయనుంది. దీని ద్వారా యువతకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ ఖరారు చేసిందితెలంగాణ ప్రభుత్వం యువత కోసం మరో పథకం అమలు చేస్తోంది. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఆర్థిక సాయం అందిస్తోంది. భాగంగా ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రంగంలోకి అడుగుపెట్టాలనుకునే యువతకు ప్రోత్సాహం అందించేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా యువతకు ఎలక్ట్రిక్ వాహనాలను తక్కువ ధరకే అందించనుంది. భారీ సబ్సిడీతో ఈవీ వెహికల్స్‌ను అందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఇప్పటికే యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా.. వచ్చే వారం నుంచి లబ్దిదారులను ఎంపిక చేయనుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరక అర్హులైనవారికి వెహికల్స్‌ను పంపిణీ చేసేందుకు సిద్దమవుతోంది. ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఈ పథకం అమలు చేయనున్నారు. అందులో భాగంగా దాదాపు 10 వేల మంది తొలిగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు కాగా, ప్రభుత్వం ఈ పథకం కోసం రూ.219 కోట్ల ఖర్చు చేయనుంది. ఈ వెహికల్స్ ద్వారా లాజిస్టిక్స్, ఈ-కామర్స్, డెలివరీ రంగాల్లో యువత రాణించవచ్చు. దాదాపు 30 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. 5016 మందికి టూవీలర్లను అందించనుంది. ఒక్కో యూనిట్ విలువ రూ.లక్షగా నిర్ణయించింది. కాగా... ముందుగా 2508 మందికి త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను అందించనున్నారు. ఇందుకోసం ఒక్కో ఈవీ వెహికల్‌కు రూ.3 లక్షల ఖర్చు కానుంది. వీటి కోసం తయారీదారుల నుంచి టెండర్లను ఈ నెలాఖరు కల్లా ఖరారు చేయనుంది. దీంతో.. ప్రభుత్వం కాలుష్య రహితంగా కొత్త వాహనాలను తీసుకురావాలనే లక్ష్యంతో పాటుగా యువతకు స్వయం ఉపాధి కల్పించేలా ఈ పథకానికి రూప కల్పన చేసారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## కేంద్రం.. డీలిమిటేషన్ ను రాజకీయ అస్త్రంగా వాడుతుంది : గౌరవ్ గొగోయ్



ఢిల్లీ: మహిళా బిల్లు సభలో ప్రవేశపెట్టడం ఇది తొలిసారి కాదని లోక్ సభ సభ్యుడు గౌరవ్ గొగోయ్ తెలిపారు. ఇంత హడావుడిగా బిల్లును ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చర్చ ప్రారంభించిన గొగోయ్ మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని.. డీలిమిటేషన్ కు మాత్రమే వ్యతిరేకమని తెలియజేశారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడం కేంద్రానికి ఇష్టం లేదని, అందుకే మార్పులు చేస్తున్నారని విమర్శించారు. జనగణన తర్వాత డీలిమిటేషన్ అన్నారని, డీలిమిటేషన్ ను రాజకీయ అస్త్రంగా వాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పుడు.. మహిళా రిజర్వేషన్లకు, డీలిమిటేషన్ కు లింక్ పెడుతున్నారని, మూడేళ్లలో ఏం మారిందని, 815 స్థానాలు వస్తాయని కేంద్రం ఎలా నిర్ణయిస్తుంది..? గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారని, జనగణన, నియోజకవర్గాల పురర్విభజనకు చాలా సమయం పడుతుందని తమరే చెబుతున్నారని అన్నారు. జనగణన ప్రక్రియ చేపట్టాలని హోంమంత్రి అమిత్ షా చెబుతున్నారని, ఈ విషయం ఆధారంగా మహిళల పక్షాన కేంద్రం లేదని అర్థమౌతుందని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్లపై పలుమార్లు వేర్వేరు ప్రకటనలు చేస్తున్నారని, మహిళల రిజర్వేషన్ల అమలును మరింత ఆలస్యం చేసే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సులువుగా ఆమోదం పొందే బిల్లుకు అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారని, 2023లోనే కాంగ్రెస్ మాట విని ఉంటే 2024లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యేవని పేర్కొన్నారు. మహిళల రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టవద్దని సూచించారు. ప్రస్తుతం ఉన్న 543 సభ్యుల సంఖ్యా బలంతో మహిళా రిజర్వేషన్లు అమలవుతాయని, కేంద్రం చేస్తున్న రాజకీయాలు.. మూడు బిల్లుల్లో ప్రస్ఫూటం అవుతున్నాయని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో మహిళా రిజర్వేషన్లను అమలు చేయవద్దని యోచన చేయండని గౌరవ్ గొగోయ్ కోరారు.

## తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తాం

### - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు చెక్‌లు, ట్రోఫీలను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని, వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ కప్ స్ఫూర్తితో వచ్చే ఏడాది కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులను, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత 8 ఏండ్లుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను, టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన కాకతీయ క్రికెట్ అకాడమీ బృందాన్ని అభినందించారు. విజేతలకు చెక్‌లు, ట్రోఫీల ప్రదానంకేసీఆర్




క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల్లో టోర్నీ విన్నర్‌గా నిలిచిన 51వ డివిజన్ జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన 49వ డివిజన్ జట్టుకు కేటీఆర్ గారి చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. డిపార్ట్మెంట్ క్రికెట్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన అంజలి కిడ్నీ కేర్ సెంటర్ హాస్పిటల్ జట్టుకు, రన్నర్-అప్‌గా నిలిచిన సంకీర్తన హాస్పిటల్ జట్టుకు కూడా ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ క్రికెట్ అకాడమీ (ఐఅం) ఫౌండర్ చైర్మన్ ఫారుక్ అలీ, కే సి ఏ సభ్యులు మాజీద్, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు, 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్ రావు, ప్రెసిడెంట్ ఫిరోజ్, 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మూటిక రాజు, యాదగిరి, పులి రజనీకాంత్, జోరిక రమేష్, నయీముద్దీన్, ఇమ్మిడి రాజు, దువ్వ కనకరాజు, ఇస్మాయిల్, కేశోజు ప్రణయ్, చిన్నా, రాంమూర్తి, రాకేష్ యాదవ్, వినీల్ రావు తదితర డివిజన్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాగళం



# ధాన్యం కొనుగోలు చేయాలని కమలాపూర్ రైతుల అందోళన

నిజామాబాద్ నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దత్తత గ్రామం కమలాపూర్ లో రైతులు ఆందోళనకు దిగారు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ధాన్యాన్ని కోసి నెలరోజులవుతున్న కాంటాలు చేయడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. కలెక్టర్ వచ్చి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలంటూ రైతులు డిమాండ్ చేసారు.

# పర్ధాన్ గూడ వద్ద బైక్ ను ఢీకొన్న టాటా మ్యాజిక్

కాగజ్ నగర్ : మితిమీరిన వేగం ఇద్దరు ప్రయాణికుల ప్రాణాల మీదకు తెచ్చింది. పట్టణ శివారులోని ప్రధాన్ గూడ సమీపంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. ఎదురెదురుగా వస్తున్న టాటా మ్యాజిక్, బైక్ బలంగా ఢీ కొనడంతో రహదారి రక్తసిక్తమైంది. కాగజ్ నగర్ పట్టణం నుండి సిర్పూర్ ద్విచక్ర వాహనం పై వెళ్తున్న జగన్, శిల్ప అనే ఇద్దరు వ్యక్తులు తమ బైక్ పై ప్రధాన్ గూడ మలుపు వద్దకు చేరుకోగానే, ఎదురుగా అతి వేగంగా దూసుకొచ్చిన టాటా మ్యాజిక్ వాహనం వారిని అమాంతం ఢీ కొట్టింది. ఈ భీకర ప్రమాదంలో బైక్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జవ్వగా, బైక్ పై ఉన్న ఇద్దరు తీవ్రగాయాలతో రోడ్డు పై పడి విలవిల్లాడారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను కాగజ్ నగర్ లోని ప్రజాలైఫ్ కేర్ హాస్పిటల్ కు తరలించారు. జగన్, శిల్పలకు తల, కాళ్ల భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యులు వారికి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. కాగజ్ నగర్ సిర్పూర్ రహదారి పై వాహనాల వేగానికి అడ్డు అదుపు లేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నా రు. ముఖ్యంగా మలుపుల వద్ద డ్రైవర్ల అజాగ్రత్త అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల ఆరోగ్యమే.. సమాజ ఆరోగ్యం : కలెక్టర్ సత్య శారద



గీసుకొండ : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు ఆరోగ్యంగా ఉంటుందని, అదే విధంగా సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ సత్య శారద అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, వివిధ శాఖల అధికారులతో, మండల సర్పంచులతో కొనయమాకుల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సత్య శారద పాల్గొని మాట్లాడారు. సమాజం బాగుండాలంటే విద్య, వైద్యం రెండూ ముఖ్యమని, సర్పంచులు వీటి పై దృష్టి సారించాలని కోరారు. పిల్లలు చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులను ఉద్దేశించి అన్నారు. తల్లిదండ్రుల కష్టం విలువను పిల్లలకు తెలిసేలా పెంచాలని సూచించారు.సర్పంచులు అందరూ నడుం బిగించి గ్రామాల్లో మంచి పర్యావరణం తీసుకువచ్చి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. నా కుటుంబం నిరుపేద కుటుంబం. నేను కట్టిన అత్యధిక యూనివర్సిటీ ఫీజు రూ.600 మాత్రమే. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాను అని ఆమె తెలిపారు. రైతులు తగు జాగ్రత్తలు పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. సర్పంచుల సమస్యలను అధికారులకు చేరవేయడానికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఉయ్యాయుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంఈఓ రవీందర్, మండల సర్పంచులు రాజకుమార్, రడం భరత్, పేర్ల శ్రవణ్, యమునా ప్రవీణ్, గాలి యాకయ్య, వీరేందర్, వీరన్న, స్వరూప, దివ్యభారతి, మౌనిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైదుకూరు జాతీయ రహదారిపై కారు బీభత్సం

మైదుకూరుమైదుకూరు జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. కడప -కర్నూల్ జాతీయ రహదారిపై కారును ఢీకొన్న వాహనం ముందువైపు ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తులు దువ్వూరు మండలానికి చెందిన మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి గా గుర్తించారు. ఇరువురిని మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్ కు తరలించారు. అదే కారు చాపాడు మండలం పల్లగోలు వద్ద వ్యక్తిని ఢీకొనడంతో మైదుకూరుకు చెందిన కొండయ్య మృతి చెందాడ. కొండయ్య పని నిమిత్తం మైదుకూరు నుండి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తి కడప పట్టణం అక్కాయి పల్లెకు చెందిన కొట్టే ప్రశాంత్ గా గుర్తించారు. ప్రశాంత్ సాఫ్ట్వేర్ ఉగ్యోగి భార్య కాపురానికి రాలేదన్న టెన్షన్ లో వేగంగా కారు నడిపినట్టు సమాచారం. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చాపాడు పోలీసులుతెలిపారు

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత....

## "అరైవ్ అలైవ్ " కార్యక్రమంలో భాగంగా వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు




జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ''అరైవ్ అలైవ్'' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆదేశాల మేరకు నాలుగవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, కాబట్టి నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం మరియు చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వలననే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ మరియు బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించడం జరిగింది. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

## డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అరైవ్-అలైవ్ కిందరోడ్‌సేఫ్టీ పై అవగాహన సదస్సును రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు, శారీరక పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన వాహనాలను రోడ్లపైకి రాకుండా చూడాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడపకుండా చూడాలని పోలీస్ అధికారులు సూచించారు. వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు చేయాల్సిన ప్రాథమికచికిత్సపై ప్రజలకు అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. మన పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకుసూచించారు.ఆర్టీసీఆర్ఎంరాజు మాట్లాడుతూ. మనదేశంలో ఏటా రెండు లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని వివరించారు. రవాణా శాఖ ఉప కమిషనర్‌పెద్దింటి పురుషోత్తం మాట్లాడుతూ. అతివేగం, అజాగ్రత్త, నిద్రలేమి, మైనర్లు వాహనాలు నడపడం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఎదిగిన పిల్లలు కళ్ళముందే చనిపోతే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత తెలంగాణకు కృషి చేయాలన్నారు. డిఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్, ప్రథమ చికిత్స పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ. రోడ్డు ప్రమాద బాధితుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రహవీర్ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు.ఆరోగ్యశ్రీ వర్తించే అన్ని ఆసుపత్రుల్లో రహవీర్ కింద రూ. లక్షన్నర వరకు వైద్య సహాయం అందిస్తారని వివరించారు. క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్పిన వారికి రహవీర్ కింద 25 వేల బహుమతి అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నిబంధనలను విద్యార్థులు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నాటిక ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు, శాఖల అధి కారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు సిపిఆర్ చేసే విధానం చేసి చూపించారు.

డ్రైవర్లకు సన్మానం:రోడ్డు ప్రమాదాలు జరగకుండావాహనాలు నడిపిన జిల్లాలోని ఆర్టీసీ, లారీడ్రైవర్లతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్డీవో మహేశ్వర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ వినోద్ స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేతా రెడ్డి, రోడ్డు రవాణా శాఖ , వైద్య,ఆర్ అండ్ బి అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

# యువత ప్రాణాలు అమూల్యం

## రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

## ?రాష్ట్ర అడిషనల్ డీజీపీ సీఐడీ మరియు ఏసీబీ చారు సిన్హా



కరీంనగర్ కరీంనగర్‌లో ఘనంగా అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు?విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, సీపీఆర్ పై అవగాహన.ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది యువత ప్రాణాలు కోల్పోవడం అత్యంత ఆందోళనకరమని, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాష్ట్ర అడిషనల్ డీజీపీ సీఐడీ మరియు ఏసీబీ చారు సిన్హా పేర్కొన్నారు.?తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త రోడ్డు భద్రతా వారోత్సవాలు ఏప్రిల్ 13 నుండి 18 వరకు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పర్యవేక్షణలో స్థానిక అస్త్ర కన్వెన్షన్ హాలు నందు గురువారం 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చారు సిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?అడిషనల్ డీజీపీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:?సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ. ప్రమాదాల నివారణకు 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అత్యంత కీలకమని చెప్పారు. ఒకరి నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు పాటించాల్సిన ప్రధాన అంశాలను ఆమె వివరించారు.?ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి?కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం విస్మరించకూడదు.?ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రాణాపాయానికి సంకేతాలు.?మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం నేరమని హెచ్చరించారు.?ప్రత్యేక ఆకర్షణగా సీపీఆర్ డెమో మరియు కంటి పరీక్షలు:?ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విద్యార్థులకు అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్ సిపిఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన డెమో ఇచ్చారు. అలాగే మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.?ప్రతిజ్ఞ మరియు హెల్మెట్ల పంపిణీ:?కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరితో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అడిషనల్ డీజీపీ చేతుల మీదుగా ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, వేణుగోపాల్, శ్రీనివాస్ జి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, పలువురు ఇన్స్పెక్టర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# 6 గ్యారంటీల అమలు కోసం 1000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు

సిద్దిపేట రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం 6 గ్యారంటీల అమలు కోసం 1000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిందని జిల్లా కలెక్టర్ కే.హైమావతి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో మండల స్థాయి సభ నిర్వహించారు. అందులో భాగంగా కొమరవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కొమరవెల్లి మండల స్థాయి సభలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల మండల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన ప్రజా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల వివరాలు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజులపాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని దానిలో భాగంగా ఈ నెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించామని, జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభను నిర్వహిస్తున్నామని అన్నారు. మే మాసంలో నియోజకవర్గ స్థాయి మరియు జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రతివారం ఒక డిపార్ట్మెంట్ థీమ్ ను తీసుకొని జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని మొదటివారం ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని, తర్వాత హెల్త్ వీక్, ఇప్పుడు అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు తప్పకుండా రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రన, రైతు సంక్షేమం, విద్యా కార్యక్రమాలు, క్రీడలు యువజన సంక్షేమం, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్ణీత ప్రణాళిక ప్రకారం 99 రోజులలో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం మరియు సేంద్రియ వ్యవసాయం చేసి పాటించి అధిక దిగుబడిని సాధించడంతోపాటు భూమి సారం పెరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో కొత్తగా 25 వేల రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాత రేషన్ కార్డులలో 37 వేల మంది సభ్యులను చేర్చి ప్రతినెల 6580 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో 11241 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా 9954 ఇండ్ల గ్రౌండింగ్ జరిగిందని 204 కోట్ల రూపాయల బిల్లులను చెల్లించడం జరిగిందని కొత్తగా ప్రతి నియోజకవర్గానికి మరొక 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ కోసం 22 కోట్ల 83 లక్షల రూపాయలు సబ్జరీ అందించడం జరిగిందని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు వినియోగించుకున్న లబ్ధిదారులకు 152 కోట్ల రూపాయల విలువైన ఉచిత విద్యుత్ అందించడం జరిగిందనీ, రైతు భరోసా పథకం ద్వారా మూడు లక్షల పదకొండు వేల మంది రైతుల ఖాతాలలో 392 కోట్ల రూపాయలను తాజాగా జమ చేయడం జరిగిందని, 330 కోట్ల రూపాయలు మహిళల ఉచిత బస్సు ప్రయాణం కు చెల్లించడం జరిగిందని, పేద ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమ, అభివృద్ధి కోసం 1 వెయ్యి కోట్ల రూపాయలు ఆరు గ్యారెంటీ ల ద్వారా జిల్లాలో ప్రభుత్వం ఖర్చు చేయడం తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని దానిలో భాగంగా మర్కుక్ మండలంలో ఈ విద్యా సంవత్సరం నుండి తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొండపాక మండల కేంద్రంలో 200 కోట్ల రూపాయలతో 16 ఎకరాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయల జీవిత బీమా ప్రతి కుటుంబానికి లభిస్తుందని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ కాలేజీలలో కూడా ఉచిత మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయనున్నదని అదేవిధంగా ప్రైమరీ స్కూల్స్, హై స్కూల్స్ తో పాటు ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనున్నదని తెలిపారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వారి ద్వారా రహదారి భద్రత పై మరియు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ద్వారా పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిజ్ఞ చేయించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ఎగ్జిబిషన్ పరిశీలించారు.

ప్రజాగళం



## కొనసాగుతున్న విద్యుత్ అర్టిసన్ల సమ్మె

రంగారెడ్డి,రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అర్టిసన్ ల ఉద్యోగులు తమకు సమాన పనికి సమాన వేతనం కావాలంటూ ఆందోళన బాట పట్టారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిసన్ ఉద్యోగులు ఆరు ప్రధాన డిమాండ్లతో ఆందోళన బాట పట్టారు. గత 9 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. ఆరు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం యాజమాన్యం తక్షణమే అమలు చేయాలంటూ 10 యూనియన్లు జాయింట్ యాక్షన్ కమిటీగా తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవిఎజెఏసి) గా ఏర్పడి ఆందోళన బాటపట్టారు. ఈరోజు కార్మికుల నిర్వహిస్తున్న ధర్నాకు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ మద్దతు పలికారుఆర్టిజన్ ఉద్యోగులలో విద్యార్హతలను బట్టి ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అంటే ప్రస్తుతం ఉన్న ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలి. ఆన్ మాండ్ వర్కర్లను ఆర్టిజన్ లను విలీనం చేయాలి 2016 డిసెంబర్ కన్నా ముందు నుండి విద్యుత్ సంస్థలో పనిచేస్తూ నేటికి అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఆర్టీసన్ ఉద్యోగులుగా గుర్తించాలి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 2026 పి ఆర్ సి వేతన సవరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు.

## బోయిన్ పల్లి లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

సికింద్రాబాద్..ప్రజలకు శాంతిభద్రతల పట్ల భరోసా కల్పించడమే లక్ష్యంగా నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్ తెలిపారు. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలీ కాంప్లెక్స్ తో పాటు పరిసర ప్రాంతాలలో 300 మంది పోలీసు సిబ్బందితో నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ డైరీ ఫామ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల ఆక్సిటోసిన్ రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ ఇంట్లో హుక్కా తయారీ యంత్రంతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోయిన్ పల్లి ప్రాంతంలో గంజాయి సరఫరా పై కూడా ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు గంజాయి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పోలీసులకు అన్నివేళలా ప్రజలు సహకరించాల్సిన బాధ్యత ఉంటుందని అన్నారు.

## 'కేజ్రీవాల్ కోర్టు విచారణ వీడియోలు తొలగించండి'.. ఢిల్లీ హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించిన కోర్టు విచారణ వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. అనుమతి లేకుండా కోర్టు విచారణలను రికార్డ్ చేయడం నిషేధమని పేర్కొంది. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ కోర్టు వాదనలకు సంబంధించిన అనధికారిక రికార్డింగ్‌లను సోషల్ మీడియా నుండి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీపై సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ స్వర్ణ కాంత శర్మను తప్పించాలని కోరుతూ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఏప్రిల్ 13న ఆయన స్వయంగా కోర్టుకు హాజరై తన వాదనలు వినిపించారు.కాగా, జస్టిస్ స్వర్ణ కాంత శర్మ, అరవింద్ కేజ్రీవాల్ మధ్య జరిగిన కోర్టు విచారణ వీడియో, ఆడియో క్లిప్స్‌ను ఆప్ నేతలతో పాటు కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్ అయ్యాయి.మరోవైపు ఒక వ్యక్తి దీనిపై హైకోర్టులో ఫిర్యాదు చేశారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేయడం, న్యాయవ్యవస్థ ప్రతిష్టకు హాని కలిగించడం దీని లక్ష్యమని ఫిర్యాదుదారు ఆరోపించారు. అనుమతి లేకుండా కోర్టు విచారణలను రికార్డ్ చేయడం నిషేధమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఈ కోర్టు విచారణ వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఫిర్యాదుదారు కోరారు. అలాగే ఆ క్లిప్‌లను షేర్ చేసిన పార్టీ నాయకులు, ఇతరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ హైకోర్టు ఈ ఫిర్యాదుపై స్పందించింది. కోర్టు విచారణ వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అలాగే అనధికారికంగా రికార్డ్ చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని పేర్కొంది.

## డంపింగ్ యార్డులో కుళ్లి పోయిన మృతదేహం లభ్యం

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి పరిధిలోని కైతలాపూర్ డంపింగ్ యార్డ్ చెత్త కుప్పలో 45-50 వయసు కలిగిన గుర్తు తెలియని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. నరసింహా అనే వ్యక్తి డయల్ 100 కు సమాచారం ఇవ్వడంతో కూకట్ పల్లి పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది.. నీ ప్రభుత్వం కూలేందుకు రెడీగా ఉంది : మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేం అలసిపోయాం. మీరు పెట్టే అవమానం.. ఈ వ్యవస్థలో మాకు జరిగే అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో మీరు లేరు. కారణమేంటో మీరే చెప్పాలి. దీని క్కారణమేంటి.. నీ వెనుక గుంతలు తవ్వుతున్నరు.. నల్లికుట్లోళ్లు ఎవరు ..? చెప్పమంటవా..? నీ గవర్నమెంట్ కూలిపోవడానికి చాలా సిద్ధంగా ఉంది. నువ్వు ఒక్కడివే పనిచేస్తే కుదరదు కదా.. వర్గీకరణ అయిన తర్వాత కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సమావేశాలు పెడితే నువ్వేమైనా చేయగలిగావా?? అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అసలు అవినీతి పరులను ఒక్కన్నన్నా నువ్వు తీసేసినవా..? ఒక్కడి మీదనన్నా నువ్వు యాక్షన్ తీసుకున్నవా.. అసలు ఎవరు అవినీతి పరులు.. ఈ గుంతలు తవ్వేటోడు ఎవరు..? అవినీతిలో 10 శాతం అని పేరు పడ్డ మంత్రి ఎవరు..? అసలు నీ పార్టీ ఎట్లొస్తది. ఇంత బహిరంగ అవినీతి రాష్ట్రంలో ఏ మూలకెళ్లి ఎవరిని అడిగినా.. ఒక మంత్రికి 10 పర్సెంట్ అనే పేరుంది ఆయనకు.. 10 పర్సెంట్ అంటే ఆయన పేరు చెబుతురు జనం. మరి ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నవ్ నువ్వు.ఒక వ్యక్తి ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైతే ఏంది.. అవినీతి పరుడు ఎవరైనా తీసేయాల్సిందే. ఎందుకు తీసేయ్యలేకపోతున్నవ్.. నీకు ముఖ్యమంత్రి పదవే ముఖ్యమా..? నీ పదవి ఉండాలన్నా.. ప్రజలు నీవెంబడి ఉండాలే కదా.. ప్రజలు నీ వెంబడి ఉండాలంటే అవినీతి పరులకు అంతం పలకాలి కదా.. ఈ గొయ్యి తవ్వుతున్నది ఎవరు..? ఇంత అవినీతి పరుడు ఉన్న ప్రభుత్వంఎట్లా నడుస్తదని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.




## టెహ్రాన్‌లో అసిమ్ మునీర్.. అణ్వస్త్ర అంశాలపై ఇంకా ప్రతిష్టంభన

వాషింగ్టన్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ప్రస్తుతం ఇరాన్)లో పర్యటిస్తున్నారు. టెహ్రాన్‌లో ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచితో భేటీ అయ్యారు. అయితే అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తలను తగ్గించే నేపథ్యంలో అసిమ్ మునీర్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే యుద్ధం విషయంలో ఇరాన్, అమెరికా మధ్య కొన్ని అంశాల్లో అగ్రిమెంట్ కుదిరింది. రెండు వారాల సీజ్‌ఫైర్ నేపథ్యంలో ఇంకా కొన్ని తేలని అంశాలు ఉన్నాయి. ఇరాన్ చేపట్టే అణ్వస్త్ర కార్యక్రమాల గురించి రెండు దేశాల మధ్య ఒడంబడిక కుదరలేదని ఓ సీనియర్ ఇరానీ అధికారి తెలిపారు. అసిమ్ మునీర్ రాక వల్ల అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కొంత తగ్గినట్లు ఓ అధికారి చెప్పారు.కొన్ని అంశాల్లో అంగీకారం కుదిరిందని, అయితే టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య చర్చల వల్ల సీజ్‌ఫైర్‌ను మరింత పొడిగిస్తారన్న భావన వస్తోందని ఆ అధికారి తెలిపారు. కేవలం అణ్వస్త్ర రంగం అంశంలో మాత్రం అమెరికా,ఇరాన్ మధ్య బేధాభిప్రాయాలు వస్తున్నట్లు వెల్లడించారు. శుద్ధీకరించిన యురేనియంతో పాటు న్యూక్లియర్ ఆంక్షల అంశంలో ఇంకా అంగీకారం కుదరలేదని తెలుస్తున్నట్లు ఆ అధికారి చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య జరిగే రెండో దఫా చర్చలపై ఇంకా తేదీలను నిర్ణయించలేదని పాకిస్థాన్ విదేశాంగ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ఆ దేశాలు న్యూక్లియర్ అంశాలపై చర్చిస్తున్నాయన్నారు.



## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ, రైతు సంఘం రాస్తారోకో

మునుగోడు, ఏప్రిల్ 16 : నెల రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కాంటాల కోసం ఎదురు చూస్తున్న రైతులను తాలు, తేమ పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదని డిమాండ్ చేశారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురజా రామచంద్రం మాట్లాడుతూ.. నెలల తరబడి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందికి గురి చేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రెలు పెట్టకుండా ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు చేయాలన్నారు.ఆరుగాలం శ్రమించి మార్కెట్‌కు తీసుకొస్తే పలు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. మిల్లర్లు అధికారులు కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని హాజరైన తాలు, తేమ పేరుతో కొనుగోలుకు నిరాకరించడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా తెలిపారు. రాస్తారోకో సందర్భంగా స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు విషయం తెలుసుకున్న స్థానిక తాసీల్దార్ రైతులకు న్యాయం చేస్తామని, కొనుగోలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఐ రైతు సంఘం నాయకులు బిస్మించి కూర్చోవడంతో పోలీసులు వారిని బలవంతంగా తరలించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు బండమీది యాదయ్య, మందుల పాండు, ఈదులకంటి కైలాస్, కాగితం వెంకన్న, దుబ్బ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, తీర్పార కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి, చిరగోని శంకర్, నరసింహ పాల్గొన్నారు.

## ముస్తఫాకు అంబేద్కర్ జాతీయ అవార్డు




రుద్రంపూర్, ఏప్రిల్ 16 : అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అభ్యుదయ రత్న?2026 అవార్డును రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా అందుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ చిక్కడపల్లిలో గల త్యాగరాయ గానసభలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖుల సమక్షంలో ముస్తఫాకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ డా. కె. చక్రవర్తి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, న్యూమరాలజిస్ట్ దివంగ శర్మ, రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, రిటైర్డ్ ఐఏఎస్ బి.లక్ష్మీకాంతం, రిటైర్డ్ ఎస్పీ ఎస్.ఎం. రత్న, అష్టావధాని సురభి శంకర శర్మ, రిటైర్డ్ డీఎస్పీ డాక్టర్ జి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.రామవరం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు, కరపత్రాలు, కవితల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పిస్తున్నందుకు గాను ముస్తఫా ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ముస్తఫాను ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు మొక్కల వెంకటయ్య, మొక్కల రాజశేఖర్, సుగుణారావు, తూముల శ్రీనివాస్, సావేటి స్వామి, నజీర్, తులసి రామ్, యశ్వంత్, కొయ్యడ వెంకటేశ్వర్లు, రాజారాం, దశరథ్ రజ్వ తదితరులు అభినందించారు.

## బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ

### కేంద్ర పనితీరును అడిగి తెలుసుకున్న అడిషనల్ డీజీపీ చారు సిన్హా

కరీంనగర్ ,కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీలైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ సీఐడీ మరియు ఏసీబీ చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న 'భరోసా' కేంద్రాన్ని ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు.?రికార్డుల పరిశీలన సిబ్బందికి సూచనలు:?కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డీజీపీ, సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ అందించడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.?శిక్షల శాతం పెరగాలి:?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయి. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించాలి. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు మరియు ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమ న్నారు.తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## 'సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బ్లాస్టింగ్‌కు నో ఎన్‌ఓసీ'




### ధన్వాద్ పంచాయతీ కఠిన నిర్ణయం

రుద్రంపూర్, ఏప్రిల్ 16 : ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బ్లాస్టింగ్‌కు అవసరమైన అభ్యంతరం లేని ధృవపత్రం (ఔెూఅ) ఇవ్వబోమని చుంచుపల్లి మండలం ధన్వాద్ పంచాయతీ సర్పంచ్ గుగులోతు జ్యోతి స్పష్టం చేశారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. సింగరేణి గనుల కార్యకలాపాల వల్ల గ్రామంలో దుమ్ము తీవ్రంగా వ్యాపిస్తూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులు కూడా యాజమాన్యం కల్పించడం లేదని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో కొత్త అఊఖ సైడింగ్, రహదారి, ఎంబాంక్మెంట్ పనులు ఎఐఅఓ ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా కొనసాగుతున్నాయి. భూమి తవ్వకాల సమయంలో గట్టి రాళ్లు ఎదురవడంతో బ్లాస్టింగ్ అవసరం ఏర్పడింది. దీనికి అనుమతుల కోసం సింగరేణి అధికారులు జిల్లా పరిపాలనను సంప్రదించగా, అధికారులు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామ సభలో గ్రామస్తులు పలు సమస్యలను ప్రస్తావించారు. తాగునీటి కోసం కనీసం రెండు కుళాయిలు కూడా ఏర్పాటు చేయలేదని, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఇతర పంచాయతీలకు ఇచ్చి తమను విస్మరించారని ఆరోపించారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, ప్రభావితం కాని ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. బ్లాస్టింగ్ కారణంగా గాలి కాలుష్యం పెరిగి దుమ్ము తీవ్రంగా వ్యాపిస్తోందని, పేలుళ్ల వల్ల ఇళ్లలో చీలికలు వస్తున్నాయని, కంపనాల వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రాళ్లు 500 మీటర్ల నుంచి 1 కిలోమీటర్ దూరం వరకు ఎగిరి పడుతున్నాయని, ఇది ప్రాణాపాయానికి దారితీసే ప్రమాదమని హెచ్చరించారు. భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఆఉఓూ నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని, బఫర్ జోన్ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, గాలి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.గతంలో పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పని చేయించుకున్నారు కాగితాలను పక్కకు పెట్టారు, ఇదేనా మాట మీద నిలబడే మీ తత్వం, ఇదేనా ప్రభావిత ప్రాంత ప్రజల పైన మీకు ఉన్న శ్రద్ధ, ఆఖీ కింద స్థానిక యువతకు ఉద్యోగాలు, విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాలని కోరారు. అంతేకాకుండా వీ కే కోల్ మైన్ విస్తరణలో భాగంగా మాయాబజార్ ప్రాంతంలో నిర్వాసితులైన 15 మందికి ఇంటి స్థలాలు కేటాయించాలని, ఇంటి స్థలాలు కేటాయించిన స్థలాలలో మంచినీటి వసతులు కల్పించాలని, మా ప్రాంతంలోనే పనులు జరుగుతున్నాయి తమ పిల్లలు ఆడుకోవడానికి నాలుగు లారీల మట్టి అడిగితే ఇవ్వలేదని. ఇదే రైల్వే సైడింగ్ తీసుకున్న మట్టి పాల్వంచ వరకు ఎట్లా వెళ్లింది అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఔెూఅ ఇవ్వబోమని సర్పంచ్, పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వికే కోల్ మైన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. నరసింహా రావు మాట్లాడుతూ.. దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజాగళం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ట్రంప్ ఇంట రచ్చ మొదలు

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ ఆయన పట్టిందల్లా వివాదమే అవుతున్నది. ఇంటాబయటా ఆయన నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. 'అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూ అగ్రరాజ్యం పగ్గాలు అందుకున్న ట్రంప్ 'అమెరికాను గ్రేట్ చేయకపోయినా ఫర్వాలేదు, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలుకుబడి తగ్గించకపోతే చాలు!' అనే పరిస్థితి ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు ఇన్నాళ్లు శత్రువులకు మాత్రమే నచ్చలేదు. కానీ ఇప్పుడు సొంత దేశంలోని వారికి కూడా ఇష్టం లేదని తెలుస్తోంది. ఆసియా దేశాలకు చమురు సరఫరా కోసం కీలకంగా ఉన్న హర్మోజ్ జల సంధిని దిగ్బంధం చేస్తున్నట్లు ఇటీవల ట్రంపు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయం పై కొన్ని మిత్ర దేశాలతో సహా అమెరికా సైన్యం కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు సైన్యం ఎందుకు వ్యతిరేకిస్తుంది? ట్రంప్ హర్మోజ్ దిగ్బంధంపై మిత్ర దేశాలు ఏమంటున్నాయి? ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య రగిలిన చిచ్చుతో అమెరికా ఎంట్రీ ఇచ్చి యుద్ధ వాతావరణన్ని నెలకొల్పింది. ఇప్పటికే ఇరాన్ పై ఎన్నో రకాల దాడులు చేసిన అమెరికా ఆ తర్వాత ఆ దేశ సుప్రీం లీడర్ ను అంతం చేసిన విషయం తెలిసిందే. అయితే యురేనియం పై ఆధిపత్యం తమది ఉండాలన్న అమెరికా కు ఇరాన్ వ్యతిరేకంగా నిలుస్తూ గట్టి పోరాటాన్ని చేస్తోంది. కొన్ని రోజులుగా సాగిన యుద్ధం తర్వాత ఏప్రిల్ 11న పాకిస్థాన్లోని ఇస్లామాబాదులో ఇరాన్, అమెరికా నేతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. అయితే ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఆసియా దేశాలకు కీలక రవాణా మార్గం అయిన హర్మోజ్ జల సంధిని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం మోపారు. ఆ తర్వాత ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి దిగారు. మిత్రులు, శత్రువులన్న తేడా లేకుండా అందరిపై భారీగా టారిఫ్‌లు విధించారు. వీటిని అమెరికా ఫెడరల్ కోర్టు కొట్టేయడంతో అమెరికా అధ్యక్షుడికి సొంత దేశంలో చుక్కెదురైంది. ఆ తర్వాత డ్రగ్ మాఫియాను నడుపుతున్నారన్న ఆరోపణలపై ఏకంగా వెనెజువెలా దేశాధినేతను రాత్రికిరాత్రి అరెస్టు చేశారు. అనంతరం పశ్చియాసియాలో పోరుకు ఆజ్యం పోశారుఇరాన్‌ను రెండు వారాల్లోపు అదుపులోకి తీసుకుంటానని భావించిన ట్రంప్ ఎంతకీ పైచెయ్యి సాధించకపోవడం, రోజూ వేల కోట్ల రూపాయల నష్టం వస్తుండటంతో ఐదు రోజుల విరామాన్ని ప్రకటించారు. ఆ తర్వాత విజయం తమదేనని స్వయంగా ప్రకటించుకొని శాంతి చర్చలకు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధం చేయాలన్న ట్రంప్ నిర్ణయంపై సొంత దేశంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైకి వేరే కారణాలు చెప్తున్నప్పటికీ యుద్ధం వద్దని వారించినందుకే అటార్నీ జనరల్ పామ్ బొండిని, అంతకుముందు హోంల్యాండ్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్టీ నోయిమ్‌ను పదవి నుంచి తప్పించారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అంతేకాదు, ఇరాన్ యుద్ధాన్ని మొదటినుంచి వ్యతిరేకిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చివరికి శాంతి చర్చలకు నాయకత్వం వహించాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఎడతెగని యుద్ధం వల్ల అమెరికాకు భారీగా నష్టం వాటిల్లుతున్నదని అమెరికన్లు విమర్శిస్తున్నారు. 'నో కింగ్స్' నిరసనలు వెల్లువెత్తిన విషయం విదితమే. 54 శాతం మంది అమెరికన్లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఇటీవల ఇప్సాస్ రాయిటర్స్ సర్వేలో వెల్లడవడం అందుకు నిదర్శనం. 24 శాతం ట్రంప్ చర్యను సమర్థించగా, 22 శాతం దీనిపై స్పందించడానికీ విముఖత చూపారట. అధికార రిపబ్లికన్ పార్టీలోనూ 46 శాతం మంది ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని తేలడం గమనార్హం.రాన్ ఈ జలసంధి పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. కొన్ని దేశాలకు చెందిన నౌకలను వెళ్లకుండా ఆపుతోంది. ఆయా దేశాలు టోల్ ఫీజు కడితేనే విడిచిపెడుతోంది. అయితే భారత్ తో సహా కొన్ని మిత్ర దేశాలకు ఇరాన్ ఎలాంటి ఫీజు లేకుండా నౌకలను విడిచిపెడుతోంది. ఈ సమయంలో ట్రంప్ ఎలాంటి నౌకలు వెళ్లకుండా చేస్తామని.. పూర్తిగా దిగ్బంధం చేసినట్లు చెప్పాడు. అయితే ఈ నిర్ణయం పై సొంత దేశ సైనిక అధికారులు వ్యతిరేకత తెలుపుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఒక సమస్య తొలగి పోవాలంటే పరిష్కారం గురించి ఆలోచించాలి. కానీ ట్రంప్ కొత్త సమస్యను సృష్టించడంతో ప్రపంచం అల్లకల్లోలంగా మారబోతుంది. ఇప్పటికే ఇరాన్ ను అమెరికా ఎన్నో రకాలుగా దాడులు చేసి ముప్పు తిప్పలు పెడుతున్నా.. ఎలాంటి భయాందోళన చెందడం లేదు. కానీ ఇప్పుడు ట్రంపు తీసుకునే నిర్ణయంతో మిత్రదేశాలు కూడా వ్యతిరేకంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.కొన్ని వర్గాల వారి వస్తున్న సమాచారం మేరకు గల్ఫ్ దేశాలైన కువైట్ వంటివి అమెరికాకు మిత్ర దేశంగా ఉన్నా కూడా.. ట్రంప్ తీసుకునే నిర్ణయాలపై వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నేరుగా ఇరాన్తో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఇలా అమెరికాకు మిత్ర దేశాలుగా ఉన్నవి.. నేరుగా ఇరాన్తో చర్చలు జరిపి సఫలం అయితే అప్పుడు అమెరికా ఒంటరిగా మారే అవకాశం ఉంది. మరోవైపు అమెరికాలోని డాలర్ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం కూడా ఉందని తెలుస్తోంది.ఇది ఇలా ఉండగా హర్మోజ్ జలసంధిని తాము దిగ్బంధం చేశామని చెబుతున్నా కూడా.. అమెరికన్ సైనిక బలగాలు ఇప్పటివరకు ఈ జల సంధి కి చేరుకోలేదన్నట్లు తెలుస్తోంది.

# దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలేటీ...

న్యూఢిల్లీ, బెంగళూరు, ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్)రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, 2026: దీని ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెరుగుతుంది. ఇందులో రాష్ట్రాల నుండి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 మంది సభ్యులు ఉంటారు.డీలిమిటేషన్ బిల్లు, 2026: జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఒక శక్తివంతమైన 'డీలిమిటేషన్ కమిషన్'ను ఇది ఏర్పాటు చేస్తుంది.కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, 2026: పెరిగిన సీట్లు, మహిళా రిజర్వేషన్లను కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేలా ఈ బిల్లు మార్పులు సూచిస్తుంది.ఈ ప్రతిపాదనలపై తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తమకు, ఈ జనాభా ఆధారిత సీట్ల పెంపు అన్యాయం చేస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ దీనిని రాష్ట్ర ప్రయోజనాలపై దాడి అని అభివర్ణించగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇది దేశ సమాఖ్య వ్యవస్థ సమతుల్యతను దెబ్బతీస్తుందని దేశ ప్రధానికి లేఖ రాశారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరగడం వల్ల, భవిష్యత్తులో దేశ రాజకీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందనేది ప్రధాన ఆందోళన. మాజీ కేంద్ర మంత్రి చిదంబరం గణాంకాలతో వివరిస్తూ, ప్రస్తుత నియోజకవర్గాల మార్పు వల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా 24.3% నుండి 20.7%కి పడిపోతుందని హెచ్చరించారు. ఇది ఒక దురుద్దేశపూరిత కుట్ర అని ఆయన విమర్శించారు.నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రధాన రాష్ట్రాల్లో సీట్ల మార్పులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది:తమిళనాడు ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 49 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 59 స్థానాలు లభిస్తాయి.కేరళప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 23 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 30 స్థానాలు లభిస్తాయి.ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 33 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 37 స్థానాలు లభిస్తాయి.తెలంగాణ ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 24 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 25 స్థానాలు లభిస్తాయి.ఒడిశా ప్రస్తుతం 21 స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 28 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 31 స్థానాలు లభిస్తాయి.కర్ణాటక ప్రస్తుతం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 41 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 42 స్థానాలు లభిస్తాయి. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 80 స్థానాల ఉండగా, గణనీయంగా 140పైగా లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.ప్రతిపక్షాల వాదన ప్రకారం, కేవలం జనాభా ఆధారంగా చూస్తే తమిళనాడు సీట్లు తగ్గవచ్చు. కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'దామాషా పద్ధతి'లో అవి పెరిగినట్లు కనిపిస్తున్నా.. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాబల్యం తగ్గుతుందనేది వారి అసలు పాయింట్. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న వ్యవస్థ ఇప్పుడు కాలం చెల్లిందని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మేలు జరిగేలా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జనాభా అదుపులో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీట్లు పెరుగుతాయని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరి అని, 15 ఏళ్ల పాటు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సభలో వినిపించడానికి సభ్యుల సంఖ్య పెరగడం ప్రజాస్వామ్యానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.సోనియా గాంధీ వంటి అగ్రనేతలు సైతం రాజకీయ ప్రాతినిధ్యంలో వచ్చే ఈ పెనుమార్పులు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం నుండి జరగబోయే ఈ మూడు రోజుల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదానికే పరిమితం కాకుండా, ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ, ఆర్థిక అసమానతలపై చర్చకు వేదిక కానున్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలను ఎలా శాంతింపజేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పెద్ద ఎత్తున అక్రమంగా నిర్వహించిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న కాంగ్రెస్ నేతలు

ఎల్బీ నగర్,ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ కర్మాంగట్లో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి రేషన్ బియ్యం ఉన్న గోదాన్ని సీజ్ చేయించారు .టీపీసీసీ అధికార ప్రతినిధి స్థానిక కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి సూచన మేరకు శ్రీనివాస కాలనీ నందు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలం తనిఖీలు చేసి పట్టుకోవడం జరిగిందని ఆ పార్టీ నేత ప్రవీణ్ తెలియజేశారు. అనంతరం సంబంధిత సివిల్ సప్లై శాఖ అధికారులకు,పోలీస్ అధికారులకు తెలియజేసారు. సంఘటనా స్థలానికి అధికారులు చేరుకొని సీజ్ చేయడం జరిగింది.ప్రజా ప్రభుత్వం అయిన రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరూ సన్నబియ్యం పొందాలనే లక్ష్యంతో వేలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సరఫరా జరుగుతున్న సమయంలో, కొంతమంది రేషన్ డీలర్లు డబ్బు కోసం ఆశపడి ఈ విధంగా అక్రమంగా బియ్యం అమ్మడం చాలా బాధాకరం అని ఆయన తెలిపారు.పేద ప్రజల హక్కులను దోచుకుంటున్న ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, మళ్లీ ఈ విధమైన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

# డీ లిమిటేషన్ బిల్లుతో పీఓకేలో ఎన్నికలు....

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసింది. మహిళా బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లు కూడా ఆమోదించుకొని చరిత్ర సృష్టించాలని కేంద్రం చూస్తుంది. పనిలో పనిగా జమ్ము కశ్మీర్ విషయంలో కూడా అత్యంత కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయం తీసుకోనుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనే దశాబ్దాల నాటి వాదనను చట్టబద్ధంగా మరింత బలపరిచే దిశగా చర్యలు తీసుకుంటోంది. డీలిమిటేషన్ బిల్లులో అత్యంత ప్రధానమైన అంశం పాక్ ఆక్రమిత కశ్మీర్ నియోజకవర్గాలకు సంబంధించి కీలక ప్రస్తావన ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూకశ్మీర్ భూభాగాలు ఎప్పుడైతే విముక్తి పొందుతాయో అప్పుడే ఆ ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేసే అధికారాన్ని ఈ బిల్లు భారత ఎన్నికల కమిషన్‌కు కట్టబెడుతోంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ఈ బిల్లు పాక్ ఆక్రమిత కశ్మీర్ తక్షణమే ఎన్నికలు నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వదు. ఇది ఒక భవిష్యత్ కార్యాచరణ. ఆ భూభాగం తిరిగి భారత్ ఆధీనంలోకి వచ్చిన మరుక్షణమే ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రారంభించడానికి అవసరమైన చట్టపరమైన వెసులుబాటును ముందుగానే కల్పిస్తోంది. ఈ బిల్లుతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు 2026ను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ సవరణల ప్రకారం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నిర్మాణంలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో 90 స్థానాలు ఉండగా, పునర్విభజన తర్వాత ఈ సంఖ్య 114 కు పెరుగుతుంది. ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్ కోసం 24 స్థానాలను ఖాళీగా ఉంచుతున్నారు. ఈ స్థానాల వల్ల ప్రస్తుతం భారత్ పరిపాలనలో ఉన్న ప్రాంతాల ఓటింగ్ శక్తికి ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జమ్ముకశ్మీర్ నుంచి లోక్ స్థానాల సంఖ్యను ప్రస్తుతం 5 నుంచి 7కు పెంచే అవకాశం ఉంది. నామినేటెడ్ ఎమ్మెల్యేల సంఖ్యను ఐదు నుంచి 7కు పెంచరు. వీరిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు కశ్మీరీ వలసదారులు, ఒకరు పాక్ ఆక్రమిత కశ్మీర్ శరణార్థి అయ్యి ఉంటారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కి ఈ నామినేషన్లు చేసే అధికారం ఉంటుంది. ముఖ్యంగా మహిళా సభ్యుల సంఖ్యను రెండు నుంచి మూడుకి పెంచే ప్రక్రియ నియోజకవర్గాల సర్దుబాటు తర్వాతే అమలులోకి వస్తుంది. ఈ బిల్లు రాజకీయ, వ్యూహాత్మక ఎత్తుగడ వెనుక చాలా పెద్ద కథనే ఉంది. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గతంలో అనేక సార్లు పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేశారు. ఆ ప్రాంత ప్రజలే పాకిస్తాన్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని ఎటువంటి బలప్రయోగం లేకుండానే ఆ ప్రాంతాన్ని భారత్ తిరిగి పొందుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా అంతర్జాతీయ వేదికలపై ఆ ప్రాంతం భారత్‌లో అంతర్భాగమని పలుమార్లు నొక్కి చెప్పారు. ఏదో ఒక రోజు భారత్ పూర్తి అధికారాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడు వచ్చిన డీలిమిటేషన్ బిల్లు 2026 ఆ ఆశయాలకు ఒక చట్టపరమైన రూపంగా కనిపిస్తోంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**పసుపు రైతులకు మేలు చేకూర్చడమే ధ్యేయంగా పని చేస్తున్నామని వెల్లడి**

**అట్టహాసంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక మండల సభలు**



నిజామాబాద్, ఏప్రిల్ 16 : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం సిరికొండలోని ఎ.జీ.దాస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మండల సభలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో సభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ఒక్కో పథకం వారీగా అధికారులు వెల్లడించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకతను చాటారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ది పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన ప్రయోజనాల గురించి సభలో తమ అభిప్రాయాలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500/-కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, ఆయా పథకాల ద్వారా లబ్ది చేకూర్చడం జరుగుతుందని భరోసా కల్పించారు. తొలివిడత ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తుది దశకు చేరాయని, త్వరలోనే ప్రభుత్వం రెండవ విడత కింద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని అన్నారు. గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేయనుందని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న యంత్రలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ పథకం కింద కల్టివేటర్లు, రోటవేటర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై సమకూరుస్తోందని అన్నారు. రైతులకు లాభదాయకంగా ఉండేలా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పీ.ఓ)లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రలోని బారామతి ప్రాంత రైతులు ఎఫ్.పీ.ఓలను ఏర్పాటు చేసుకుని, నూతన విధానాలలో పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా ఎంతో వృద్ధి సాధించారని అన్నారు. జిల్లా రైతాంగం కూడా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ సేద్యపు రంగంలో ప్రగతి సాధించాలని, ఈ దిశగా ప్రభుత్వం రైతు వేదికల ద్వారా అమలు చేస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలలో పాల్గొని పంటల సాగు విషయమై సలహాలు, సూచనలు పొందాలని కలెక్టర్ సూచించారు.

# స్పోర్ట్స్ న్యూస్

## 'దోశ, ఇడ్లీ' పాటపై బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు..




సాధారణంగా క్రికెట్‌లో కొన్ని జట్ల మధ్య మ్యాచ్ అంటే అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తుంటారు. అలాంటి మ్యాచులకూ మైదానాలు ఫుల్ అవుతుంటాయి. అదే విధంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అంటే.. స్టేడియం కిక్కిరిసి పోతుంది. ఈ రెండు జట్ల మధ్య క్రీడా వైరమే అందుకు కారణమని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలోనే ఓ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దోశ, ఇడ్లీ అనే పాటపై బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే...ఐపీఎల్ 2026లో భాగంగా ఏప్రిల్ 5న చిన్నస్వామి స్టేడియం వేదికగా బెంగళూరు, చెన్నై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 43 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఓడింది. అయితే ఈ మ్యాచ్ ఫలితం పక్కన పెడితే.. సీఎస్కే ఇన్నింగ్స్ ప్రారంభానికి ముందు 'దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ' అంటూ ఓ డీజే ప్లే చేశారు. ఈ పాటపై చెన్నై జట్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ' అనే పదాలను వాడుతూ తమిళనాడు గుర్తింపును ఎగతాళి చేశారని బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు చేసింది. స్టేడియంలో తమ ఆటగాళ్లను, తమిళ సంస్కృతిని కించపరిచేలా ప్రవర్తించారంటూ ఫిర్యాదులో పేర్కొంది.చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ..' సాధారణంగా డీజేలు హోమ్ టీమ్‌కు మద్దతుగా ఉంటారు. ఆ విషయాన్ని మేము తప్పుగా భావించడం లేదు. కానీ చిన్నస్వామి స్టేడియంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇడ్లీ, దోశ అనే పాటను ప్లే చేస్తూ మా ఆటగాళ్లను డీజే కించపరిచాడు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ విషయం పై మేము బీసీసీఐకి లేఖ రాశాం" అని తెలిపాడు.2025 నుంచే 'దోశ, ఇడ్లీ' పాట వివాదం నడుస్తోంది. గత సీజన్‌లో ఆర్సీబీ ప్లేయర్ జితేశ్ శర్మ ఈ పాట పాడటంపై సోషల్ మీడియాలో రచ్చ జరిగింది. అప్పట్లో చెపాక్ స్టేడియంలో జితేశ్ ఔటైనప్పుడు అదే పాటను ప్లే చేసి సీఎస్కే డీజే సభ్యులు బదులిచ్చారు. కానీ వారి మేనేజ్‌మెంట్ జోక్యం చేసుకుని ప్రత్యర్థి ఆటగాళ్లను టార్గెట్‌గా చేసుకుని కించపరచొద్దని ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఈ పాట వివాదం మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఐపీఎల్ లో చాలా కాలం చెన్నై సూపర్ కింగ్స్ తమ ప్రాంతీయ ప్రత్యర్థులపై పై చేయి సాధిస్తూ వచ్చింది. కానీ ఇటీవలి కాలంలో పరిస్థితి తారుమారైంది. 2024 నుంచి ఇటీవలి మ్యాచ్‌తో కలిపి సీఎస్కేపై ఆర్సీబీ వరుసగా నాలుగు మ్యాచ్‌లను గెలిచింది.

## ఆందోళనకరంగా టీమిండియా మాజీ క్రికెటర్ ఆరోగ్యం.. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం!

భారత క్రికెట్‌లో అగ్రశేణి బ్యాటర్‌గా వెలుగొందిన వినోద్ కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మెదడులో క్లాట్ ఏర్పడటంతో భవిష్యత్తులో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదముందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని కాంబ్లీ స్నేహితుడు మార్కస్ కౌటో ధ్రువీకరించారు. ప్రస్తుతం కాంబ్లీ కోలుకుంటున్నప్పటికీ పూర్తిగా ఆరోగ్యవంతుడిగా లేడని వెల్లడించారు. 90వ దశకంలో భారత జట్టులోకి అడుగుపెట్టిన వినోద్ కాంబ్లీపై భారీ అంచనాలు ఉండేవి. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు అతడు బాల్యమిత్రుడు.గతేడాది కిడ్నీ సంబంధిత ఇన్ఫెక్షన్, కండరాల నొప్పులతో థానేలోని ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నాడు. అప్పట్లో అతడి ఆరోగ్యంపై పెద్ద చర్చ జరిగింది. సునీల్ గావస్కర్, కపిల్ దేవ్ వంటి దిగ్గజ ప్లేయర్లు కాంబ్లీకి ఆర్థిక సాయం కూడా చేశారు. తాజాగా కాంబ్లీ స్నేహితుడు చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. 'కాంబ్లీకి మెదడులో క్లాట్ ఏర్పడింది. అది తొలగించడం సాధ్యం కాలేదు. వైద్యుల చెప్పినదాని ప్రకారం అతడికి భవిష్యత్తులో బ్రెయిన్ స్ట్రోక్ కూడా రావచ్చు. ఆయన జ్ఞాపకశక్తి కూడా సరిగ్గా లేదు. చాలా విషయాలు ఆయన మర్చిపోయాడు. కాంబ్లీ ప్రస్తుతం మద్యం పూర్తిగా మానేశాడు. కానీ అప్పుడప్పుడు సిగరెట్ కోసం ఇతరులను అడుగుతూ ఉంటాడు. ఆయన సమస్య అంతా మెదడులోనే ఉంది' అని కాంబ్లీ స్నేహితుడు వివరించాడు.వినోద్ కాంబ్లీ భారత్ తరఫున 104 వన్డేలు, 17 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. చెడు వ్యసనాల కారణంగా పీక్ స్టేజీలో ఉన్న అతడి కెరీర్.. అనూహ్యంగా దిగజారిపోయింది. మద్యం, ధూమపానం మితిమీరి తీసుకోవడం వల్లే ఆయన అనారోగ్యం పాలయ్యారని పలు నివేదికలు వెల్లడించిన సంగతి తెలిసిందే.



## కోహ్లీ పాదాలకు నమస్కరించిన యువ ప్లేయర్

మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు పలకరించుకుంటున్న సమయంలో 20 ఏళ్ల నమన్ తివారీ విరాట్ కోహ్లీ వద్దకు వెళ్లాడు. నమన్ తివారీతో మాట్లాడుతున్న క్రమంలో ఒక్కసారిగా వంగ కోహ్లీ పాదాలకు నమస్కారం చేశాడు. భారత్‌లో పెద్దల పట్ల గౌరవాన్ని, ఆశీస్సులను కోరుతూ చేసే ఈ సంప్రదాయ పద్ధతిని నమన్ తివారీ అనుసరించడం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచింది. విరాట్ కోహ్లీ కూడా నమన్ తివారీ చేసిన ఈ పనికి ఒక్కసారిగా షాక్ తిన్నాడు. వెంటనే చిరునవ్వు చిందిస్తూ నమన్‌ను పైకి లేపి అతడిని అభినందించాడు.యువ క్రికెటర్లకు ఐపీఎల్ అనేది కేవలం ఓ టోర్నమెంట్ మాత్రమే కాదు, కోహ్లీ వంటి మేటి ప్లేయర్ల నుంచి నేర్చుకునే ఓ గొప్ప వేదిక. నమన్ తివారీ గతేడాది అండర్-19 ప్రపంచ కప్‌లో భారత్ తరఫున అద్భుతంగా రాణించాడు. గంటకు 145 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగల సత్తా ఉన్న ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను లక్నో జట్టు గత వేలంలో రూ. 1 కోటికి దక్కించుకుంది. తన రోల్ మోడల్‌ను కలిసిన ఉత్సాహంలో నమన్ ఇలా తన అభిమానాన్ని చాటుకున్నాడు.ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగాడు. మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ.. బ్యాటింగ్‌లో మాత్రం తన విశ్వరూపం చూపించాడు. లక్నో నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోహ్లీ 34 బంతుల్లో 49 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేవలం ఒక పరుగుతో హాఫ్ సెంచరీ మిస్ అయినప్పటికీ.. ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరడంలో కోహ్లీ ఇన్నింగ్స్ ఎంతో దోహదపడింది. గ్యాలరీలో ఉన్న అభిమానులు కూడా కోహ్లీ-నమన్ తివారీ మధ్య జరిగిన ఈ మధుర ఘట్టాన్ని చూసి సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.




## అంతర్జాతీయ క్రికెట్‌కు సీనియర్ పేసర్ వీడ్కోలు.. కారణమిదే..!




బంగ్లాదేశ్ క్రికెటర్ రూబెల్ హ్సస్సేన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. కొన్ని రోజులుగా గాయాలతో సతమవుతున్న రూబెల్ మూడు ఫార్మాట్ల నుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. ఐదేళ్ల క్రితం చివరి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడిన ఈ పేసర్ తన రిటైర్మెంట్ వార్తను ఫేస్‌బుక్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. వన్డేల్లో అరంగేట్రంలోనే నాలుగు వికెట్లు తీసిన బంగ్లా బౌలర్‌గా చరిత్రకెక్కిన రూబెల్ ఇకపై దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నాడు.పసికూనగా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన బంగ్లాదేశ్ సంచలన విజయాలతో నేడు పటిష్టమైన టీమ్‌గా ఎదిగింది. ఈ క్రమంలో రూబెల్ లాంటి పేసర్లు బంగ్లా క్రికెట్‌కు వెన్నుదన్నులా నిలిచారు. 2009లో తొలి వన్డే ఆడిన ఈ పేసర్ నాలుగు వికెట్లతో రికార్డు నెలకొల్పాడు. వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌పై నాలుగు వికెట్లతో వార్తల్లో నిలిచిన రూబెల్ సుదీర్ఘ కెరీర్‌ను ముగించాడు. ఓవైపు గాయాలు వేధిస్తుండడం.. జాతీయ జట్టులో కుర్రాళ్ల పాతుకుపోవడం కారణంగా వీడ్కోలుకు సరైన సమయమని భావించాడీ స్పీడ్‌స్టర్.'నేను పేస్ బౌలర్ రూబెల్ హ్సస్సేన్. బంగ్లాదేశ్ తరఫున 27 టెస్టులు, 104 వన్డేలు, 28 టీ20లు ఆడాను. జాతీయ జట్టుకు ఆడడమంటే చాలా ఇష్టం. కానీ, ఏదో ఒక దశలో అంతర్జాతీయ క్రికెట్‌ను వదిలేయాల్సిన అవసరం ఉంది. ఆ ఉద్దేశంతోనే నేను రిటైరవుతున్నా. అయితే.. దేశవాళీ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతాను. ఈ సందర్భంగా నా కుటుంబానికి, స్నేహితులకు, మీడియాకు, అభిమానులకు ధన్యవాదాలు తెలయజేస్తున్నా.వీరంతా నన్ను ఇకపై కూడా మద్దతుగా నిలుస్తారని ఆశిస్తున్నా' అని రూబెల్ తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. ఫార్మాట్లలో కీలక బౌలర్‌గా రాణించిన రూబెల్ వన్డేల్లో అదుర్స్ అనిపించాడు. 34.31 సగటుతో 129 వికెట్లు కూల్చిన వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో బంగ్లా బౌలర్‌గా మరో రికార్డు తన పేరిట రాసుకున్నాడు.

## బంగ్లా క్రికెట్ అభిమానులకు షాక్.. రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ బౌలర్

బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హెస్సేన్ అభిమానులకు బిగ్ షాక్ ఇచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. 36 ఏళ్ల రూబెల్ 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆడిన తొలి వన్డేలోనే నాలుగు వికెట్లు తీసిన తొలి బంగ్లాదేశ్ బౌలర్‌గా రూబెల్ చరిత్ర సృష్టించాడు. తన 16 ఏళ్ల కెరీర్‌లో 159 మ్యాచ్‌లు ఆడి 193 వికెట్లు తీశాడు. అలానే 27 టెస్ట్‌ల్లో 36 వికెట్లు, 104 వన్డేల్లో 129 వికెట్లు, 28 టీ20ల్లో 28 వికెట్లు పడగొట్టాడు.బంగ్లాదేశ్ తరఫున రూబెల్ 2021 ఏప్రిల్‌లో తన చివరి మ్యాచ్ (టీ20) ఆడాడు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు అవకాశాల కోసం ఎదురుచూసిన సెలక్టర్ల దృష్టిని ఆకర్షించలేకపోయాడు. చివరికి అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు తాజాగా ప్రకటించాడు. ఇకపై దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతూ, యువ ఆటగాళ్లకు మార్గదర్శకుడిగా ఉంటానని రూబెల్ స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ సందేశంలో అభిమానులు, కుటుంబం, మీడియాకు కృతజ్ఞతలు తెలిపాడు.పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరుగాంచిన రూబెల్ రివర్స్ స్వింగింగ్ యార్కర్లు వేయడంలో దిట్ట. 2015 వన్డే ప్రపంచ కప్?లో పటిష్టమైన ఇంగ్లండ్‌ను మట్టి కరిపించడంలో రూబెల్ కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో అతను వేసిన 4/53 స్పెల్ బంగ్లాదేశ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఐదో వ్యక్తిగా రూబెల్ నిలిచాడు. 2013లో న్యూజిలాండ్‌పై అతను సాధించిన ఆరు వికెట్లలో ఒక హ్యాట్రిక్ కూడా ఉంది. అంతేకాక రూబెల్, టీమిండియా క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ మధ్య అనేక సందర్భాల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.




## ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'లో ప్రత్యేకంగా నిలిచిన ఆర్సీబీ

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్2026లో జరిగిన మ్యాచ్ లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. దీంతో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ ఇప్పటి వరకు ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింట్లో విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదరగొడుతూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. ఎల్ఎస్‌జీ మ్యాచ్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన చేసిన జోష్ హేజిల్‌వుడ్‌ను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ (ఖుూఓ) అవార్డు వరించింది. ఈ క్రమంలో ఓ ఆసక్తికర అంశం బయటపడింది.ఈ సీజన్‌లో ఆర్సీబీ తరఫున నాలుగు మ్యాచుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకున్న ప్లేయర్లంతా విదేశీ క్రికెటర్లే కావడం గమనార్హం. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై జాకబ్ డఫీ (న్యూజిలాండ్), చెన్నై సూపర్ కింగ్స్‌పై టిమ్ డేవిడ్ (ఆస్ట్రేలియా), ముంబై ఇండియన్స్‌పై ఫిల్ సాల్ట్ (ఇంగ్లాండ్, లఖ్‌నవూపై జోష్ హేజిల్‌వుడ్ (ఆస్ట్రేలియా)లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్నారు. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే.. 2025 నుంచి బెంగళూరు తరఫున 10 మంది వేరువేరు ఆటగాళ్లు ఈ అవార్డులను అందుకొన్నారు. ఐపీఎల్‌లో మరే జట్టులోనూ ఇలాంటిది చోటుచేసుకోలేదు.ఇక లఖ్‌నవూ మ్యాచ్‌లో జోష్ హేజిల్‌వుడ్ చక్కడ బౌలింగ్ వేశాడు. నాలుగు ఓవర్ల కోటాలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందుకున్న సందర్భంగా జోష్ మాట్లాడుతూ.. వరుసగా తాము నాలుగు మ్యాచులు గెలిచామని, వారి షెడ్యూల్ కూడా బాగుందని తెలిపాడు. అలానే ముమ్ముందూ ఇదే వ్యూహం కొనసాగిస్తామని అనుకుంటున్నామని జోష్ తెలిపాడు.



ప్రజాగళం



# తాటి ముంజలు తింటే భలే ఆరోగ్య ప్రయోజనాలు.. అసలే వదిలిపెట్టరు!



సమ్మర్ సీజన్లో దొరికే తాటి ముంజల వలన బోలెడు ఉపయోగాలు ఉంటాయి. తాటి ముంజలు చూడటానికి జెల్లీలా, మృదువుగా ఉంటాయి. ఏప్రిల్ నెల నుండి మొదలుకొని మే నెల చివరి వరకు తాటి ముంజలు మనకు పుష్కలంగా దొరుకుతాయి . ఎలాంటి కల్తీలేని పకృతి వరప్రసాదాయిని ఏదైనా ఉంది అంటే అది తాటి ముంజలే. తాటి ముంజలు తినడం వలన మీ కడుపు త్వరగా చల్లబడుతుందితాటి ముంజలలో మన శరీరానికి కావాల్సిన బోలెడు పోషకాలు ఉంటాయి. ఎండాకాలంలో చెమటతో త్వరగా డిహైడ్రేషన్ అయ్యేవారికి తాటి ముంజలు శరీరం హైడ్రేట్ అయ్యేలా చేస్తాయి. వర్క్ రీత్యా ఎక్కువగా బయట గడిపేవారు రోజుకు బాడీకి సరిపోయేంత మంచి నీరు తాగకపోవడం వలన కిడ్నీలలో రాళ్ళు ఏర్పడతాయి. ఈ సమస్య ఉన్నవాళ్ళకు కూడా తాటి ముంజలు దివ్యౌషధం. తాటి ముంజలతో బరువుకు చెక్కడుపులో మంట, మూత్ర విసర్జన సమయంలో పొత్తికడుపులో భరించలేని నొప్పితో బాద పడేవారు క్రమం తప్పకుండా ఒక పదిహేను రోజులు పాటు లేత ముంజలను తినాలి. ఇక తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన ఏ, బీ, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియంవంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తాటి ముంజలు మన శరీర బరువు తగ్గటానికి ఎంతగానో దోహదం చేస్తాయి.తాటి ముంజలతో శరీరానికి శక్తితాటి ముంజలు కాలేయ సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. ఈ ముంజలలో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విష పదార్ధాలను తొలగిస్తుంది. తాటి ముంజలు మన శరీరానికి కావాల్సిన శక్తిని ఇచ్చి అలసటను తగ్గిస్తాయి. ఇక ఎండాకాలంలో చాలా వేడి చేసి ఇబ్బంది పడే వారు తాటి ముంజలను తింటే శరీరం చల్లబడుతుంది. శరీరానికి చలువ చేకూర్చే తాటి ముంజలను ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తారు.తాటికల్లు ఆరోగ్య అద్భుతాలు తక్కువేం కాదు.. కానీ ఇది గుర్తు పెట్టుకోండి!తాటి ముంజలు సమ్మర్ లో చాలా అవసరంతాటి ముంజలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. శరీరానికి మేలు చేసే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలంలో మన శరీరం నుండి చెమట బయటకు పోతుంది. శరీరంలోని పోషకాలు చెమట రూపంలో బయటకు పోతాయి. వాటిని భర్తీ చేయటానికి తాటి ముంజలు ఎంతో అవసరం.

# రోజంతా ఏసీలో ఉంటున్నారా? అయితే ఈ జబ్బులకు మీరే బాధ్యులు!

ఎండాకాలం వచ్చేసింది. బయట తీవ్రమైన ఎండలు దాటికి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్న వారు ఏసీ గదులకు పరిమితం అవుతున్నారు అయితే ఎక్కువగా ఏసిన వినియోగిస్తే అనారోగ్యాల బారిన పడటం ఖాయం అనే విషయాన్ని ఒకరు కచ్చితంగా తెలుసుకోవాలి. అసలు ఎక్కువగా ఏసీ ని ఉపయోగిస్తే వచ్చే దుష్ప్రభావాలు ఏమిటి? మన ఆరోగ్యం ఏవిధంగా పాడవుతుంది అనే విషయాలను ప్రస్తుతం తెలుసుకుందాం ఏసీలో ఉంటే ఈ అనారోగ్యాలు ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారం రోజులనుండి వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పులు కారణంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటటంతో ఒకసారిగా వాతావరణం హీటెక్కిపోతుంది. ఈ వాతావరణానికి తట్టుకోలేక ఏసీ గదుల్లోనే ఎక్కువగా గడుపుతున్నారు అలా రోజంతా ఏసీ గదుల్లో ఉండటం వలన ఆరోగ్య సమస్యలు అధికవవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులున్న వారికి , అస్తమా ,ఊబకాయం ఉన్నవారికి ఆరోగ్యం మరింతగా క్షీణిస్తుంది. ఎక్కువసేపు ఏసీ గదుల్లో ఉంటే నరాల బలహీనత ప్రతి మనిషి శరీరంలో మినిమం 20 డిగ్రీల వేడి వుంటుంది. సహజంగా వాతావరణంలో 20 డిగ్రీల నుండి 25 డిగ్రీలు ఉష్ణోగ్రత ఉంటే మనం తట్టుకోగలము .. అంటే మన శరీరానికి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు అవసరం అలా కాకుండా గదిలో ఎక్కువగా లేదా సాధారణంగా ఏసీ వేసుకొని నిద్రపోతే బాడీ ఎక్కువగా చల్లగా మారి కాళ్ళ,చేతులు తిమ్మిర్లుగా మారే ఛాన్స్ ఉంటుంది. ఏసీలో ఎక్కువ ఉంటే తలనొప్పి ఎక్కువగా ఏసీ గదుల్లో ఉండటం వలన శరీరంలోని కండరాల పనితీరు తగ్గుతుంది. నరాలలో రక్త ప్రసరణ మందగిస్తుంది. కాబట్టి నరాలు బలహీనంగా మారుతాయి.. సాధారణంగా ఆరుబయట



చలి గాలిలో తిరిగే వారికి రానటువంటి జబ్బులు ఏసీ గాలితో వెంటనే వచ్చేస్తాయి. తల తిప్పడం మొదలుకొని ,వాంతులు చేసుకునే వరకు వారిపై ఏసీ ప్రభావం చూపుతుంది . చాలా మందిలో తలనొప్పి మొదలౌతుంది. ఏసీ ఎక్కువ వాడితే శరీరం డీ హైడ్రేషన్ కొంతమందిలో ఏసీ ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురవుతుంది. చర్మం పొడి పొడటం, చర్మం దురదగా మారడం వంటివి చోటు చేసుకుంటాయి. ఎక్కువసేపు ఏసీలో ఉంటే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు ఏసీ గాలి వల్ల మెదడు కణాలు బలహీనపడి మెదడు సామర్థ్యం, పనితీరు దెబ్బతింటుంది. కీళ్ళ నొప్పులు, కళ్ళపైన ఏసీ ప్రభావం ఇక కీళ్ల నొప్పులు వంటి సమస్యలతో బాధపడేవారు ఏసీలో ఉండడం వల్ల బాడీ పెయిన్స్ తో పాటు కీళ్లనొప్పులు బాధిస్తాయి. ఏసీలో ఉంటే కీళ్ళ నొప్పుల సమస్య మరింత పెరుగుతుంది. ఏసీలో ఉండడం వల్ల కళ్ళు కూడా ప్రభావితమవుతాయి. కళ్ళు పొడిబారి ఇబ్బందికి గురవుతాయి. కనుక ఎండాకాలంలో ఏసీ వినియోగం ఎక్కువ మంచిది కాదు.

# పుట్టిన నెలను బట్టి మీకీ వ్యాధులు వచ్చే ఛాన్స్.. జాగ్రత్త!

పుట్టిన నెలలను బట్టి మనకు వచ్చే వ్యాధులు కూడా ఆధారపడి ఉంటాయి. ఏ నెలలో పుట్టిన వారు ఎటువంటి వ్యాధుల బారిన పడతారు అనేది ఒక అధ్యయనంలో వెల్లడయింది. జనవరి నుంచి డిసెంబర్ వరకు ఉన్న మొత్తం 12 నెలల్లో ఒక్కొక్క నెలకు ఒక్కొక్క ప్రాధాన్యత ఉంటుంది. ఇక ఈ నెలలలో పుట్టిన వారికి ఎటువంటి సమస్యలు వస్తాయి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. జనవరి, ఫిబ్రవరి మార్చి నెలల్లో పుడితే వచ్చే వ్యాధులివే జనవరి మాసంలో పుట్టిన వారికి వెన్నునొప్పి, మైగ్రేన్, మలబద్ధకం, అల్సర్స్, గుండెపోటు, స్త్రీలకు మెనోపాజ్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి మాసంలో పుట్టిన వారికి గుండె జబ్బులు, ఆర్థరైటిస్, రక్తంలో గడ్డలు ఏర్పడడం, థైరాయిడ్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది, మార్చి నెలలో పుట్టిన వారికి గుండె జబ్బులు, ఆస్తమా, రుమటాయిడ్ ఆర్థరైటిస్, కంటి శుక్లాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఏప్రిల్, మే, జూన్ లలో పుడితే వచ్చే రోగాలివే ఏప్రిల్ మాసంలో పుట్టిన వారికి థైరాయిడ్, ఆస్టియోపోరోసిస్, ట్యూమర్లు, బ్రాంకైటిస్, ఆస్తమా వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది .మే నెలలో పుట్టిన వారికి ఆస్తమా, డయాబెటిస్, అలర్జీలు, మలబద్దకం, డిప్రెషన్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. జూన్ నెలలో పుట్టిన వారికి కంటి శుక్లాలు, గుండె జబ్బులు, బ్రాంకైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. జులై, ఆగస్ట్, సెప్టెంబర్ లో పుట్టినవారికి ఈ వ్యాధులకు అవకాశం జులై నెలలో పుట్టిన వారికి మెడనొప్పి, ఆర్థరైటిస్, ఆస్తమా, ట్యూమర్లు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఆగస్ట్ నెలలో పుట్టిన వారికి ఆస్తమా, థైరాయిడ్, పెద్ద ట్యూమర్ల వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ నెలలో పుట్టిన వారికి మానసిక సమస్యలు, గుండె సమస్యలు, రక్తహీనత వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.


# ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా?



ఖర్జూరం.. తీయటి రుచికి, మెత్తటి స్పర్శకు మారుపేరు. ఎడారి ప్రాంతపు బంగారంగా పిలువబడే ఈ ఫలం ఎన్నో పోషక విలువలతో నిండి ఉంటుంది. తక్షణ శక్తిని అందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తహీనతను తగ్గించడంలో ఖర్జూరం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే చాలామంది ఖర్జూరాన్ని తమ ఆహారంలో భాగంగా చేసుకుంటారు. అయితే, కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా పరిమితంగా తీసుకోవడం మంచిది. లేదంటే కొన్ని ప్రతికూల ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎవరు ఆ ఖర్జూరం తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిల పెంపు: ఖర్జూరంలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్, గ్లూకోజ్) అధికంగా ఉంటాయి. మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఇది వారి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. ఒకవేళ తినాలనిపిస్తే, వైద్యుల సలహా మేరకు చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. వారి డైట్లో భాగంగా ఇతర ఆహారాలను బ్యాలెన్స్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఊబకాయంతో బాధపడుతున్నవారు: ఖర్జూరంలో కేలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఒక సాధారణ సైజు ఖర్జూరంలో సుమారు 20-25 కేలరీలు ఉంటాయి. అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నవారు ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల వారి బరువు మరింత పెరిగే అవకాశం ఉంది. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా చాలా తక్కువ మొత్తంలో తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ తీసుకోవాలనుకుంటే, వారి రోజువారీ కేలరీల లెక్కల్లో దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మూత్రపిండాల సమస్యలు పెంపు. ఖర్జూరంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులకు ఇది మంచిదే అయినప్పటికీ, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు లేదా హైపర్‌కలేమియాతో బాధపడుతున్నవారు ఎక్కువ పొటాషియం తీసుకోవడం ప్రమాదకరం. వారి శరీరంలోని మూత్రపిండాలు అదనపు పొటాషియంను సమర్థవంతంగా తొలగించలేవు. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఇలాంటి సమస్యలు ఉన్నవారు ఖర్జూరం తినే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. జీర్ణ సంబంధిత సమస్యలు కొంతమందికి ఖర్జూరం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. ఖర్జూరంలోని అధిక ఫైబర్ కంటెంట్ మరియు కొన్ని సహజ చక్కెరలు కొందరికి సరిపడకపోవచ్చు. ముఖ్యంగా ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఎఖా) వంటి సమస్యలు ఉన్నవారు ఖర్జూరం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ ఖర్జూరం తిన్న తర్వాత అసౌకర్యంగా అనిపిస్తే, దానిని పూర్తిగా మానేయడం మంచిది. ఇలా ట్రై చేయండి!! సార్బిటాల్ అలర్జీ: ఖర్జూరంలో సార్బిటాల్ అనే ఒక రకమైన చక్కెర ఆల్కహాల్ ఉంటుంది. కొంతమందికి ఈ సార్బిటాల్ పడకపోవచ్చు లేదా దాని వల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంది. అలాంటివారు ఖర్జూరం తింటే కడుపు నొప్పి, విరేచనాలు లేదా ఇతర అలర్జిక్ రియాక్షన్స్ ఎదుర్కొనే అవకాశం ఉంది. సార్బిటాల్ అలర్జీ ఉన్నట్టు తెలిసినవారు ఖర్జూరానికి దూరంగా ఉండాలి. ఖర్జూరం ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు అయినప్పటికీ, ఈ ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు దానిని తినే ముందు ఒకసారి ఆలోచించడం లేదా వైద్యుడి సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. మీ శరీరం యొక్క అవసరాలను మీ ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని సరైన ఆహారం తీసుకోవడం ద్వారా మీరు ఆరోగ్యంగా ఉండగలరు. ఏదైనా ఆహారాన్ని తీసుకునే ముందు మీ ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది.

# రక్తపోటు, గుండె జబ్బులను తగ్గిండమే కాదు.. కొలెస్ట్రాల్‌ను కరిగించే బేబీ గ్రీన్స్! ఇలా ట్రై చేయండి!!

ఆరోగ్యకరమైన జీవితం కోసం చూస్తున్నారా? మీ ఆహారంలో పోషకాలను పెంచడానికి ఒక సులభమైన రుచికరమైన మార్గం కోసం చూస్తున్నారా? మైక్రోగ్రీన్స్ కంటే ఎక్కువ చూడకండి! ఈ చిన్న మొక్కలు పోషకాలతో నిండి ఉన్నాయి . మీ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మైక్రోగ్రీన్స్ అంటే ఏమిటి? మైక్రోగ్రీన్స్ అంటే కూరగాయలు , మూలికల యొక్క చిన్న, లేత మొక్కలు, ఇవి విత్తనాలు మొలకెత్తిన తర్వాత 7-14 రోజులలోపు కోస్తారు. అవి మొలకలు , బేబీ గ్రీన్స్ మధ్య వస్తాయి. వాటి పూర్తి పరిపక్వ ప్రతిరూపాల కంటే చాలా ఎక్కువ పోషకాలను కలిగి ఉంటాయి. మైక్రోగ్రీన్స్ వివిధ రకాల రంగులు, రుచులు , అల్లికలలో వస్తాయి, మీ భోజనానికి , స్నాక్స్‌కు ఒక ఉత్తేజకరమైన , పోషకమైన అదనంగా వాటిని తయారు చేస్తాయి. మైక్రోగ్రీన్స్ యొక్క పోషక ప్రొఫైల్: ఈ చిన్న మొక్కలు పోషక శక్తి కేంద్రాలుగా పరిగణించబడటానికి ఒక కారణం ఉంది. మైక్రోగ్రీన్స్ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు , ఇతర ప్రయోజనకరమైన మొక్కల సమ్మేళనాల యొక్క అద్భుతమైన మూలం. వాస్తవానికి, కొన్ని అధ్యయనాలు మైక్రోగ్రీన్స్ వాటి పరిపక్వ ప్రతిరూపాల కంటే 40 రెట్లు ఎక్కువ పోషకాలను కలిగి ఉంటాయని సూచిస్తున్నాయి! మైక్రోగ్రీన్స్‌లో సాధారణంగా కనిపించే కొన్ని ముఖ్యమైన పోషకాలు దాగి ఉంటాయి. దీనిలో విటమిన్ సి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి , యాంటీఆక్సిడెంట్‌గా పనిచేయడానికి సహాయపడతాయి. ఈ బేబే గ్రీన్స్‌లో విటమిన్ కె రక్తం గడ్డకట్టడానికి, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడతాయి. వీటిల్లో దాగిన విటమిన్ ఇ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, కణాలను నష్టం నుండి రక్షించడానికి సహాయపడుతుంది. ఖనీలివతీవట ఃఎ అంతే కాకాకుండా వీటిల్లో బీటా-కెరోటిన్ ఉంటుంది. ఇది విటమిన్ ఎ గా మార్చబడుతుంది, ఇది కంటి చూపు, రోగనిరోధక వ్యవస్థ , కణాల పెరుగుదలకు అవసరం. ఈ మైక్రోగ్రీన్స్ లో ఫోలేట్ కణాల పెరుగుదల , అభివృద్ధికి అవసరం, గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా ముఖ్యమైనది. దీనిలోని పొటాషియం, మెగ్నీషియం, ఇనుము, జింక్ మరియు రాగి వంటివి, శరీరంలోని అనేక విధులకు అవసరం. ఆరోగ్య ప్రయోజనాలు: మైక్రోగ్రీన్స్ యొక్క సమృద్ధిగా ఉన్న పోషక ప్రొఫైల్ వాటికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వలన, మైక్రోగ్రీన్స్ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి మరియు ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: మైక్రోగ్రీన్స్ రక్తపోటును తగ్గించడానికి, కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడానికి , గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడే సమ్మేళనాలను కలిగి ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: మైక్రోగ్రీన్స్‌లో ఫైబర్ ఉంటుంది, ఇది ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, ప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి: బీటా-కెరోటిన్, లుటీన్ వంటి యాంటీఆక్సిడెంట్లు మైక్రోగ్రీఎర్స్‌లో పుష్కలంగా ఉన్నాయి, ఇవి వయస్సు-సంబంధిత మచ్చల క్షీణత , కంటిశుక్లం వంటి కంటి వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడతాయి. బరువు నిర్వహణకు సహాయపడతాయి: మైక్రోగ్రీన్స్ తక్కువ కేలరీలు , అధిక ఫైబర్ కలిగి ఉంటాయి, కాబట్టి అవి బరువు నిర్వహణకు సహాయపడతాయి. అవి మిమ్మల్ని ఎక్కువసేపు నిండుగా ఉంచడంలో సహాయపడతాయి , అతిగా తినకుండా నిరోధిస్తాయి. యాంటీఆక్సిడెంట్ రక్షణను అందిస్తాయి: మైక్రోగ్రీన్స్ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉన్నాయి, ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షించడానికి



సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ , గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయి. శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి: కొన్ని మైక్రోగ్రీన్స్ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి, ఇది శరీరంలో మంటను తగ్గించడానికి, కీళ్లనొప్పులు మరియు తాపజనక ప్రేగు వ్యాధి వంటి పరిస్థితుల నుండి ఉపశమనం పొందడానికి సహాయపడుతుంది. మైక్రోగ్రీన్స్‌ను ఎలా ఉపయోగించాలి? మీ ఆహారంలో మైక్రోగ్రీన్స్‌ను చేర్చడం చాలా సులభం! వాటిని వివిధ రకాలుగా ఆనందించవచ్చు. మీ సలాడ్‌లకు పోషణ, రుచి యొక్క పేలుడు కోసం మైక్రోగ్రీన్స్‌ను జోడించండి. శాండ్‌విచ్‌లు, ర్యాప్‌లకు క్రంచ్ , పోషణ కోసం మైక్రోగ్రీన్స్‌ను జోడించండి. సూప్‌లు , స్మూతీలకు పోషకాలను పెంచడానికి మైక్రోగ్రీన్స్‌ను కలపండి. మీ వంటకాలకు రంగు, పోషణ కోసం మైక్రోగ్రీన్స్‌ను గార్నిష్‌గా ఉపయోగించండి. మైక్రోగ్రీన్స్‌ను నేరుగా ఒక ఆరోగ్యకరమైన , సంతృప్తికరమైన స్నాక్‌గా ఆస్వాదించండి. మీ స్వంత మైక్రోగ్రీన్స్‌ను పెంచుకోండి: మైక్రోగ్రీన్స్‌ను పెంచడం చాలా సులభం , సరదాగా ఉంటుంది. ఇది మీ స్వంత తాజా, పోషకమైన ఆహారాన్ని కలిగి ఉండటానికి ఒక గొప్ప మార్గం. మీరు విత్తనాలు, మొలకెత్తే ట్రే, కొన్ని ప్రాథమిక సరఫరాలతో ఇంట్లోనే మైక్రోగ్రీన్స్‌ను పెంచుకోవచ్చు. మైక్రోగ్రీన్స్ చిన్నవి కావచ్చు, కానీ అవి పోషకాలు , ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉన్నాయి. మీ ఆహారంలో వీటిని చేర్చడం అనేది మీ ఆరోగ్యాన్ని పెంచడానికి , అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఒక సులభమైన , రుచికరమైన మార్గం. కాబట్టి, ముందుకు సాగండి , మైక్రోగ్రీన్స్‌ను ప్రయత్నించండి.



# సినిమా



# అనిల్ రావిపూడి సంక్రాంతి సినిమా

## ముందే డిజిటల్ హక్కులు దక్కించుకున్న జీ5




టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మిషన్'గా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 2027 సంక్రాంతి బరిలోకి ఈసారి మల్టీస్టారర్ చిత్రంతో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటించనుండటం విశేషం. ఈ కాంబినేషన్ పై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ల విషయానికి వస్తే, కృతిశెట్టి ఒక కథానాయికగా ఫిక్స్ కాగా, మరో కీలక పాత్ర కోసం కీర్తి సురేష్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా కాస్టింగ్ మరింత బలంగా మారుతోంది. ఇంకా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ చిత్రం ఓటీటీ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీఇఇ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అనిల్ రావిపూడి గత చిత్రాలకు ఓటీటీలో వచ్చిన ఆదరణ దృష్ట్యా ఈ డీల్ రికార్డు స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు విశాఖపట్నంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రతి సినిమా స్క్రిప్ట్‌ను వైజాగ్‌లోనే పూర్తి చేసే సెంటిమెంట్ ఉన్న అనిల్ రావిపూడి, ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేసినట్లు సమాచారం.త్వరలోనే షూటింగ్ ప్రారంభించి, సంక్రాంతి సీజన్‌లో మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని దర్శకుడు ఎ÷-లాన్ చేస్తున్నాడు. ఫ్యామిలీ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీ, ఎమోషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్ హీరోల కలయిక, హిట్ డైరెక్టర్ కాంబో, భారీ ఓటీటీ డీల్ అన్నీ కలిసి ఈ సినిమాను ఇప్పటినుంచే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. కాగా, అనీల్ రావిపూడి ఇప్పటి వరకు తెరకెక్కించిన అన్ని చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించిన విషయం తెలిసందే.

# జురాసిక్ పార్క్ మూవీని వదులుకున్న శ్రీదేవి

హాలీవుడ్ సినిమాల్లో అవకాశమొస్తే ఎవరైనా వదులుకుంటారా? డబ్బుకు డబ్బు.. కావాల్సినంత ప్రచారం రెండూ ఒకేసారి వచ్చి పడతాయి. అందులోనూ స్టీవెన్ స్పీల్‌బర్గ్ మూవీ అంటే కథేంటో కూడా అడగకుండా ఒప్పుకొంటారు. కానీ, అలనాటి నటి శ్రీదేవి మాత్రం నో చెప్పారట. 1993లో విడుదలైన 'జురాసిక్ పార్క్' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల వసూళ్లను రాబట్టింది. అలాంటి చిత్రంలో నటించే అవకాశాన్ని శ్రీదేవి కాదనుకున్నారు. అందుకు గల కారణాన్ని ఆమె ఓ సందర్భంలో పంచుకున్నారు. మీరెందుకు 'జురాసిక్ పార్క్' చేయడానికి నిరాకరించారు అని అడగ్గా, 'ఆ రోజుల్లో హాలీవుడ్ సినిమాలంటే ఏలియన్‌లా చేయడమే. కానీ, ఇప్పుడు అదొక గౌరవం. అందుకే ఒప్పుకోలేదు' అని శ్రీదేవి సమాధానం ఇచ్చారు. కేవలం 'జురాసిక్ పార్క్' మాత్రమే కాదు, శ్రీదేవి కెరీర్ టాప్‌లో ఉండగా, వివిధ కారణాల వల్ల చాలా పాత్రలు వదులుకున్నారు. అందులో 'డర్' కూడా ఉంది. 'చాందినీ, లమ్హా తర్వాత డర్‌లో నా పాత్ర చాలా సాధారణంగా ఉంటుందని భావించా. ఒకవేళ షారుఖ్‌ఖాన్ పోషించిన పాత్రలాంటిదైతే చేసేదాన్నేమో.ఆ క్యారెక్టరైజేషన్ నాకు బాగా నచ్చింది. ఇక జుహీచావ్లాకు అలాంటి పాత్ర కొత్తది. ఆమె సరిగ్గా సరిపోయారు' అని శ్రీదేవి చెప్పుకొచ్చారు. 2018, ఫిబ్రవరి 24న శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే.



# టాక్సిస్ వాయిదా ర్యూమర్స్‌కు చెక్




'టాక్సిక్' కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా మరోసారి వాయిదా పడనుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలను టీమ్ ఖండించింది. అనుకున్న షెడ్యూల్ ప్రకారం జూన్ 4నే సినిమా విడుదల అవుతుందని స్పష్టంచేసింది. ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడానికి కూడా సిద్ధమైనట్లు తెలిపింది. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి యశ్ ప్రచారం మొదలుపెట్టారు. అమెరికాలో జరుగుతోన్న సినిమాకాన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. 'టాక్సిక్'తో పాటు ఆయన మరో చిత్రం 'రామాయణ' గురించి కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడనున్నారు. దీంతో యశ్ టాక్సిక్ వాయిదా వార్తలకు చెక్ పడింది. ఇందులో అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు.

# డ్రాగన్ మూవీలో ఆలియా భట్ ?

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా 'కలరిపయట్టు' వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్-ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.





# హై జవానీ తో ఇష్క్ హోనా హై' పస్ట్ లుక్ విడుదల




బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ మరియు పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ బాలీవుడ్ చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' . ఈసినిమా నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ఫస్ట్ లుక్ చూస్తుంటే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని తెలుస్తుంది. లెజెండరీ దర్శకుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 46వ చిత్రమిది. ఆయన తన కుమారుడు వరుణ్ ధావన్‌తో కలిసి మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. టిప్స్ ఫిలిమ్స్ అధినేత రమేష్ తౌరానీ, మాక్సిమిలియన్ ఫిలిమ్స్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# లెనిన్స్ నుంచి రేపు సాంగ్ విడుదల

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్‌ను ఏప్రిల్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, వంశీ ఐరటనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

